# రహదారి బంగళా

శరవేగంగా మారిపోతున్న చరిత్రకి, శాశ్వత సాక్ష్యంలా నిలబడివున్న ఆ రహదారిబంగళా లోకాన్ని అర్థంచేసుకోవడానికి చేసే ప్రయత్నంలో, తాను అక్కడ యెన్నాళ్ళనుంచి నిలిచివుందో తనే మరిచిపోయింది.

ఫర్లాంగు వెనక్కి వెలవెలబోతూన్న పల్లెనీ, మూడు మైళ్ళముందు వెలిగిపోతూన్న పట్టణాన్నీ కలుపుతూ, మెత్తని బూడిద వన్నె తెనలా, ఎర్రని కంకరరోడ్డు తన యెదురుగా పొడుగ్గా పరుచుకుపోయి వుంది. అది నిన్ననీ, రేపునీ కలిపి ముడేసిన కొండచిలువలా కదలకుండా పడి వున్నా దానిమీద అటూ యిటూ పోయే జనంలో మాత్రం యెంత చలనమో! ఎంత చైతన్యమో?

ఎదురుగుండా రోడ్డుకి అటుపక్క కొమ్మలు చాచిన మూఢనమ్మకాల పాత అలవాట్లలా తెగ యెదిగిపోయి బాగా విస్తరింపచేసింది ముసలి చింతచెట్టు ఒకటి. ఆ చింతచెట్టు గాలికి కదిలినప్పుడల్లా దానిమీదనున్న గుడ్లగూబ కూసినప్పుడల్లా, గబ్బిలం యెగిరినప్పుడల్లా రహదారిబంగళా

ప్రతిధ్వనించినట్లు సన్నగా మూలుగుతుంది, ఏవో పాత జ్ఞాపకాలన్నీ మనస్సులో మెదిలి.

చుట్టూ గతస్మృతుల్లా గజిబిజిగా అల్లుకుపోయిన తుప్పల్లోంచీ పొదల్లోంచీ కీచురాళ్ళ ధ్వని వినిపించినప్పుడు కూడా రహదారి బంగళా మనస్సు, అలాగే కలకబారి పోతుంది.

జీబురుమంటూ నిర్మానుష్యంగానూ భయంకరంగానూ వుండే ఆ పరిసరాలు, పొద్దుట ఓ గంట సాయంత్రం ఓ గంట మాత్రం కలకల్లాడుతాయి. అందుకు కారణం ఆ బంగళా ఆవరణలో సామాన్యుడి మంచితనంలా, అందరికీ అందుబాటులో వుండే మంచినీళ్ళబావి, అందుకే ఆ బావి అంటే ఆ బంగళాకి యెంతో ఆప్యాయతా, ఆదరణాను.

ఆ బంగళా కడుపులో యెన్నో గాథలు–మెదడులో యెన్నో జ్ఞాపకాలు–గుండెల్లో యేవో ఆవేదనలు యెంత ప్రయత్నించినా వాటిని మరిచిపోలేకపోతోంది. మళ్ళీమళ్ళీ జ్ఞాపకంవచ్చి మనస్సు వికలమయిపోతోంది. అసలు తను యెప్పుడేనా సంతోషంగా ఉందా! అనిపిస్తోంది. నవ్వడమనేది తనకి తెలుసా?... అనుకుంటోంది.

♦ ♦ ♦

మూడు నాలుగు దశాబ్దాలపాటు ఆ బంగళాలో తీసుకున్న నిర్ణయాలకీ, చేసిన అన్యాయాలకీ ఫలితంగా,

పల్లెలోని సుబ్బరావయ్యలాంటి యెన్నో పచ్చని కుటుంబాల బంగారు సౌఖ్యం, కరెన్సీ రూపంలో పట్నం ప్లీడర్ల యిళ్లకి ఆ రోడ్డువెంబడే నడిచిపోతే తనేం చెయ్యగలిగింది నల్లగా మాడిపోయిన ఆ కుటుంబాలపట్ల సానుభూతిగా, తనూ నల్లనిరంగు పులుముకుంది, ఒకనాడు ఎర్రగా మెరిసే బంగళా పెంకులికి.

పదేళ్ళక్రితం,వితంతువయిన మునసబుగారి మరదలు, బావగారి పరువునీ అక్కయ్య కాపురాన్నీ నిలబెట్టడంకోసం అర్ధరాత్రివేళవచ్చి యెదురుగుండావున్న చింతచెట్టుకి ఉరి బోసుకుంటూంటే విలవిల్లాడిపోవడం తప్ప తను ఏం చెయ్య గలిగింది? కానయితే విలవిల్లాడిపోవడంవల్ల, తన కుడివేపు పెంకమాత్రం ఫెళఫెళ్లాడుతూ విరిగిపోయింది అంతే!

అయిదారేళ్ళ క్రిందట మాత్రం?

వచ్చీరాని హోమియోపతీ జ్ఞానంతో, జ్వరం వచ్చిన అయిదేళ్ళ కొడుక్కి "హై పొటెన్సీ" మందు యిచ్చేశాడు, చచ్చిపోయిన కుర్రాడి సంగతి పోలీసులకి తెలియకుండా ఉండడం కోసం, ఆ పేదవైద్యుడు రాత్రికి రాత్రే కన్న కొడుకుని బుజానవేసుకొనివచ్చి, తన గోడపక్కనే తవ్వి పాతిపెడుతూ, కండువా నోట్లో కుక్కుకుని, ఏడుస్తూంటే తను ఓదార్చగలిగిందా? అలాగని గుండె బద్దలైపోకుండా తను ఉండగలిగిందా? నేలా గోడలూ,బీటలువారిపోయేలా, చలించిపోలేదూ! అలా మాడిపోయి, విరిగిపోయి, బీటలు వారిపోయి, ఇవాళ తను అందం అంతా గతించిన ఆడ

దానిలా అయింది కనకే. పూర్వం వచ్చే కళ్లజోడు బాబులూ, ఖద్దరులాల్చీ స్వాములూ యిప్పుడు తన దగ్గరికి రావడం మానుకున్నారు. అడుక్కుని తినే గుడ్డివాడికీ, వాడి గజ్జికుక్కకీ తను ఆశ్రయం అయింది ఈనాడు.

తను ఇలా దీనంగా పేద ముత్తయిదువులాగ దయనీయంగా మిగిలిపోయినా, పక్కనున్న మంచినీళ్ళ బావి అయినా నవనాగరిక యువతిలాగ గలగల్లాడుతూ పొద్దుటా సాయంత్రం వచ్చేపోయే జనంతో సందడిగా చూడముచ్చటగా ఉంటుంది. అందుకే బంగళాకి బావి అంటే యెంతో ఇష్టం—

ఫర్లాంగు దూరంలో వున్న ఆ పల్లెప్రజలకి అదే మంచినీళ్ల బావి. ఊళ్ళో ఉన్న తక్కిన బావులన్నీ ఆ ఊరి పంచాయతీ బోర్డు మెంబర్ల మనస్సులులాగ ఉప్పుకషాలూ, చేదు విషాలూను. అందువల్ల ఊళ్ళో ఉన్న ప్రతి ఆడదీ ఇక్కడికి పొద్దుటో, సాయంత్రమో బిందె బుజాన పెట్టుకుని రావలసిందే! అయితే అందరూ పొద్దుట బాగా ఎండ యెక్కాకో లేదా సాయంత్రం ఇంకా వెలుగు ఉండగానో నీళ్ళు తోడుకుని వెళ్ళిపోతారు తక్కిన సమయాల్లో. బొంగులు బొంగులుమంటూ నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రదేశానికి ఒక్కపిట్టయినా రాదు. రావడానికి భయం.

దానికి సాయం దెయ్యాలున్నాయని వాడుక ఒకటి. అప్పుడెప్పుడో చచ్చిపోయిన మునసబుగారి మరదలు,

దెయ్యం అయి అక్కడ తిరుగుతూ ఉంటుందనీ, పొలాల నుంచి ఆలస్యంగావచ్చే పాలేళ్ళకి, రాత్రిళ్ళు అరిటికాయలూ కూరలూ బళ్ళమీద పట్నానికి వేసుకెళ్ళే రైతులకీ తరచు రకరకాల రూపాల్లో కనిపిస్తూ వుంటుందని జనం చెప్పు కుంటూ భయంతో వణికిపోతూండడం కద్దు.

ఆ కబుర్లూ, ఆ భయంచూసి, వాళ్ళ అమాయ కత్వానికి, మూఢనమ్మకాలకి తనలో తాను నవ్వుకుంటూ ఉంటుంది రహదారి బంగళా. అందమైన పువ్వులతోటలా ఎదిగిన సుబ్బరావయ్య కూతురికికూడా ఆ దెయ్యాల కబు ర్లన్నా, వాటిగురించి చెప్పుకొని భయపడేమనుష్యులన్నా, అలాంటి వేళాకోళ భావమే! కంటికిరెప్పలా చూసుకుం టూన్న ఆ అమ్మాయి తలనిమురుతూ. రెండురోజులకి ఒక మారయినా సుబ్బరావయ్య "అమ్మా శాంతా! అలా ఏదీ కానివేళల్లో మంచినీళ్ళకని వెళ్ళకమ్మా! తర్వాత ఏం అనుకుని లాభంలేదు" అని అంటూవుంటే, శాంత "ఏమిటి నాన్నా నీ చాదస్తం" అంటూ నవ్వుతూ అతని మాటని కొట్టిపారేస్తూ ఉంటుంది.

ఆ వయస్సులో ఆడపిల్లలకివుండే జంకునీ, భయాన్నీ అవతలకి నెట్టి యెంతో ధైర్యంగా సంజచీకట్లో మంచినీళ్ళ కని వచ్చిన శాంతని మొదటిసారి చూసినప్పుడు రహదారి బంగళా. ఆమె చొరవకి యెంతో మెచ్చుకుంది. ఆకులు చప్పుడు విని గుడ్డివాడు "ఎవరది?" అంటూ కేకేసి

నప్పుడూ, చుట్టూ తిరుగుతూ గజ్జికుక్క అరిచినప్పుడుకూడా ఏమాత్రం తొట్రుపడకుండా సోయగాలుపోతూ నీళ్ళుతోడు కొని, ఒయ్యారంగా బిందె చంకనిపెట్టుకుని అందంగా పల్లె కేసి నడిచి వెడుతూన్న శాంతని చూసి తృప్తిగా తలపంకిం చింది ఆ బంగళా.

కానయితే ఆ తృప్తి, ఆ సంతోషం బంగళాకి ఎన్నాళ్ళో మిగలలేదు. గోడచాటుని పకపకలూ, పొదల మాటుని గుసగుసలూ రోజురోజుకి యెక్కువై, నీళ్ళబిందె తీసుకుని శాంత యింటికి వెళ్ళడం నానాటికీ ఆలస్యం చెయ్యడంతో, అది యెటువంటి పరిణామాలకి దారితీస్తుందో అని నిలువెల్లా భయంతో వణికిపోయింది. మునసబుగారి మరదలు జ్ఞాపకంవచ్చి మనస్సంతా వికలం అయిపోయింది బంగళాకి "అమ్మా జాగ్రత్త సుమా!" అని చెప్పడానికి చూస్తున్న తనకా నోరులేదు, ఆకుల చప్పుడూ పకపకలూ గుసగుసలూ వింటూన్న గుడ్డివాడికా చూపులేదు. ఇక, కన్నూ నోరూవున్న కుక్క మొరిగితే మాత్రం యేం లాభం? దానిగొడవ యెవరు పట్టించుకుంటారు? చూడగలి గిన వాళ్లకీ, చెప్పగలిగినవాళ్లకీ యిక్కడేం జరుగుతోందో తెలియడంలేదు. ఎలాగ యీ విషాద పరిణామాన్ని ఆపడం? ఏమిటి చెయ్యడం?

రోజులూ నెలలూ గడుస్తున్నాయి.

పరిస్థితులు యెలా పరిణమిస్తాయో, శాంత భవి

వృత్తు యేమౌతుందో అనుకుంటూ అనుక్షణం విలవిల్లాడి పోసాగింది బంగళా.

చివరకి అనుకున్నంతపనీ అయింది.

ఓరోజున ఆ మసక చీకట్లని చీల్చుకుని, శాంత కంఠం దీనంగానూ, ఉండుండి తీవ్రంగానూ వినిపించసాగింది.

"నీ పరీక్షలు అయి నీకు ఉద్యోగం వచ్చేదాకా ఆగడానికివీలులేదు. ఇప్పటికే మానాన్న అనుమానిస్తున్నాడు. దానికితోడు యీ సంగతికూడా తెలిసిందంటే, కుటుంబ గౌరవం గంగపాలయిందని నిలువునా కూలబడిపోతాడు. అందువల్ల ఒప్పుకో. అనుమానించకు. ఊ... అను"

శాంత కంఠం ఇలా తీవ్రంగా వినిపిస్తూనే వుంది. చెట్టుకి జేరేసివున్న సైకిలు, ఆకులు చప్పుడు చేసుకుంటూ వెళ్ళి రోడ్డుయెక్కి, పట్నంకేసి విసురుగా దూసుకుని వెళ్ళిపోయింది, పరువుగా సంఘంలో చలామణీ కావడం కోసం.

బిందె తీసుకుని బాధగా బావికేసి అడుగు కదిపిన శాంతని చూసి, విపరీతమయిన ఆవేదనలోనూ, భరించరాని ఆందోళనతోనూ మెలికలు తిరిగిపోయింది రహదారి బంగళా.

అయ్యో! మళ్ళీ పాత కథే!

భయంతో కళ్ళూ చెవులూ గట్టిగా మూసుకుంది. బాధవల్ల మనస్సు వశం తప్పింది. ఎప్పుడు స్పృహ కోల్పోయిందో తనకే తెలియదు.

మర్నాడో మూడోనాడో కాస్త తెలివి వచ్చి కళ్ళు తెరిచి చూసేసరికి బావిదగ్గర జనం కలియదొక్కుకుంటూ, కంగారుపడుతూ గుంపులు గుంపులుగా కనిపించారు. దగ్గరగా వచ్చి చూడబోతున్న వాళ్ళని దూరంగా నెట్టేస్తూ "చచ్చిపోయిన మనిషిని ఏం చూస్తారు? పొండి... పొండి..." అంటూ అరుస్తున్నారు పోలీసులు.

చూడవచ్చిన జనంలోంచి రకరకాల వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. "తేలలేదు కనక మనకు తెలియదు కాని, నిన్ననో మొన్ననో పడివుంటుందమ్మా. లేకపోతే మొహం అంతా ఉబ్బిపోయి చేపలు తినేసి, ఆనవాలు పట్టడానికి లేకుండా అయిపోదు."

"పద్దెనిమిదేళ్ళు నిండా లేవు... ఏం కష్టం వచ్చిందో ఈ వెర్రి పిల్లకి"

"పైగా వట్టి మనిషికూడా కాదు. నాలుగో మాసమో అయిదోమాసమో."

"ఈ రోజుల్లో ప్రతివాళ్ళకీ ఇదో పద్ధతయిపోయింది. కాస్త తేడా వస్తే, ఓర్చుకోలేక భయపడిపోయి, చేతులారా ప్రాణం పోగొట్టుకోవడం"

"అయినా నలుగురూ తాగే మంచినీళ్ళబావిలో వచ్చి పడడం. ఇదేం పొయ్యేకాలం? చావడానికి మొన్ని దారులు లేవు!"

జనాన్నీ, పోలీసుల్నీ హడావిడినీ చూసి ముష్టాడి కుక్క తెగ అరుస్తూ వుంది.

జనం, సందడి, మాటలూ విని 'ఏవిటి బాబూ ఏం జరిగిందీ?' అంటూ గుడ్డాడు అడుగుతూ ఉన్నాడు. కాని యెవరూ వాళ్ళ సంగతి పట్టించుకోనే లేదు.

చీకటిపడే సమయానికి జనం క్రమంగా పల్చబడ్డారు. పోలీసులు శవాన్ని పరీక్షకోసం అని పట్నం ఆసుపత్రికి తీసుకుపోయాక, మిగిలిన ఒకళ్ళిద్దరూ కూడా వెళ్ళిపోయారు. తిరిగి ఆ ప్రదేశమంతా నిర్మానుష్యంగానూ, నిశ్శబ్దంగానూ గంభీరంగా మారిపోయింది.

తుప్పల్లోంచీ పొదల్లోంచీ వినిపించే కీచురాళ్ల ధ్వనీ, ఉండుండి చింతచెట్టుమీంచి అరచే గుడ్లగూబ అరుపూ, తప్ప ఇంకేం వినిపించడంలేదు.

చుట్టూ భయంకరమైన నిశ్శబ్దం!

రహదారి బంగళా, చుక్క చుక్కలుగా చూరు లోంచి కన్నీరు కారుస్తోంది. చెట్ల కన్నీటి చుక్కలుకూడా పండి రాలిన ఆకులమీద, టప్‌టప్‌మని పడుతున్నాయి.

మనస్సంతా వికలం అయిపోయి, మెదడు మొద్దు బారిపోయిన బంగళాకు తన చుట్టూ యేం జరుగుతుందో తెలియడంలేదు, తెలుసుకునే స్థితిలోకూడా లేదు.

మఫ్లరూ, స్వెటరూ ధరించిన ఒక నల్లని నీడ నీరసంగా బావివేపు నడిచింది.

బావిచుట్టూ తిరిగి, పక్కనవున్న ఒక రాయిమీద కూర్చుంది, మోకాళ్ళమీద తలపెట్టుకుని.

చలికి మూలకిచేరి, బంగళా అరుగుమీద ముడుచుకుని పడుకున్న ముష్టాడి కుక్క, చూస్తూనే వుంది. ఆ నీడ కదలడం, కూర్చోవడం ఈ సంగతి అంతా—కాని మొరగకుండా బద్ధకంగా "పోనిద్దూ" అన్నట్టు ఊరుకుంది.

ఆ నీడ నడచినప్పుడు, మంచువల్ల తడిసి మెత్తగా అయిన ఎండుటాకులు, చప్పుడు ఏమీచెయ్యలేదు. అందుకే గుడివాడికి ఏం వినిపించలేదు. లేకపోతే "ఎవరు వారు?" అని అరిచేవాడే! చిరిగిపోయిన కంబళీ మొహంమీదకి మరి కాస్త లాగుకొని నిద్రలోకి జారిపోయాడు గుడ్డివాడు.

ఏం జరుగుతోందో బంగళా గమనించడంలేదు.

గుడ్డివాడికి వినిపించడంలేదు.

కుక్క మాత్రం రెప్పవేయకుండా చూస్తోంది. మాటలుకూడా వింటోంది. కాని దానికేం అర్థంకావడం లేదు.

తనలో తను అనుకుంటున్నట్లు ఆ నీడ కొంచెం గట్టిగానే అంది "ఇలా యెందుకు చేశావు శాంతా?" అంటూ.

సరిగ్గా అదే సమయంలో ఓ తెల్లని రూపం వచ్చి బంగళా నీడలో నిలబడన్ని గమనించింది. అరుగుమీద

ముడుచుకొని పడుకున్న కుక్క ఒక్కమాటు లేచి గుండ్ర ముగా తిరిగి మళ్ళీ ముడుచుకొని పడుకుంది.

బావి దగ్గర నల్లనినీడ యింకా తనలో తను అనుకుం టూనే వుంది. "నువ్వు యిలా చేస్తావంటే నేనా రోజున అలా ప్రవర్తించకపోదును. ఎంతపని చేశావు? మనం ఎన్ని కలలు కన్నాం? ఎటువంటి భవిష్యత్తుని తియ్యగా ఊహిం చాం? నా చదువు అయి ఉద్యోగం వచ్చాక తప్పకుండా పెళ్ళి చేసుకుంటానని, ఈలోగా యేదో సాధనం ఆలోచించ మనీ చెప్పాను కదా? ఈ రోజుల్లో ఎన్ని సాధనాలు లేవు? వచ్చిన ప్రమాదాన్ని పోగొట్టుకొని మర్యాదగా బ్రతక డానికి, ఎందుకు చేశావు శాంతా యిలా. ఎందుకు చేశావు?"

బంగళా నీడలో నిశ్చలంగా నిలబడివున్న తెల్లని నీడ, ఈ మాటల్ని విని నెమ్మదిగా చప్పుడు చెయ్యకుండా అక్కడినుంచి పల్లెవేపు కదిలింది ఎంత నిశ్శబ్దంగా వెళ్ళ డానికి ప్రయత్నించినా వీలులేకపోయింది. అక్కడక్కడ ఆకులు గలగల్లాడాయి, తొట్రుపడుతూ వేసిన అడు గులు పడి—

బావిదగ్గరకూచున్న నల్లని నీడ ఆ చప్పుడికి ఉలిక్కి పడి తలెత్తి చూసింది_మహాభయంతో నిలువెల్లా వణికి పోయింది.

మరుక్షణంలో పట్నంవేపు మహావేగంతో సైకిలు ఒకటి దూసుకుపోయింది.

చింతచెట్టుమీద గుడ్లగూబ, మంచుకి కంఠంనిండా శ్లేష్మం చేరడంవల్ల, గొంతు ఎత్తి అరవలేకపోయింది.

పేరుకుపోతూన్న రక్తంలో వేడి కలిగించడం కోసం గబ్బిలం రెక్కలు టపటపా కొట్టుకుని ఓ కొమ్మమీంచి ఇంకో కొమ్మమీదకి ఎగిరింది.

ఆ రాత్రి పంటకళ్ళందగ్గర కాపలా పడుకున్న జీతగాడు, తాను రహదారి బంగళా సమీపంలో రెండు దెయ్యాల్ని చూశానని, ఒకటి సైకిలు తొక్కుకుంటూ పట్నంవేపు వెళ్ళిపోయిందనీ మరోటి చీరచెంగు బొడ్డులో దోపుకుంటూ పల్లెవేపు నడిచిందనీ చెబుతూంటే విని రహదారి బంగళా గట్టిగా నిట్టూర్చింది, గుడ్డివాడు తలపంకించి లేచాడు. వాడి కుక్క చెవులు ఆడిస్తూ వాడిని అనుసరించింది.

ఆ తర్వాత ఒకటి రెండు రోజులకి ఆ రోడ్డుమీంచి పోయే పల్లెజనం "అవునుగానీ సుబ్బరావయ్య అలా ఎవరికీ చెప్పకుండా అర్ధరాత్రికి అర్ధరాత్రి ఊరువిడిచి వెళ్ళిపోయాడేమిటి?" అంటూ విడ్డూరంగా చెప్పుకునే మాటలు రహదారి బంగళా చెవుల్లో పడ్డాయి.

"అవును, వెళ్ళిపోక ఏం చేస్తాడు? అతనికి యింక

యీ లోకంలో ఏం మిగిలింది కనక? ఏం చూసుకుని వుంటాడు?" అంటూ మూలిగింది బంగళా - ఆ మూలుగుకి స్తంభం ఒరిగింది.

"బంగళా అరుగులమీద స్తంభం ఒరిగిపోయింది. ఇంకెన్నాళ్ళో నిలవదు. రహదారి బంగళా కూలిపోతుంది." అనుకున్నారు, మర్నాడు ఎండలో ఆ దారినపోతూ నీడ కోసం అక్కడో క్షణం నిలబడ్డ జనం-తను బాగుపడతానని, ఎప్పటికేనా తన ముఖంమీద సంతోషం విరుస్తుందనీ బంగళాకూడా అనుకోలేదు.

ఇది జరిగిన నాలుగేళ్ళకి ఒకరోజున జూనియర్ ఇంజనీరు ఒకాయన మూడేళ్ల కుర్రాడిని వెంటబెట్టుకుని భార్యతోసహా వచ్చి ఆ రహదారి బంగళా బాగుచేయించడం కోసం అందులోనే మకాంచేసి రిపేర్లు ప్రారంభించాడు.

ఒరిగిపోయిన స్తంభాలు తిరిగి నిలబడ్డాయి.

పడిపోయిన పెణక లేచింది.

బద్దలైపోయిన గచ్చులంతా నున్నగా అందంగా తయారయింది.

ఇంక నల్లగా పాచిపట్టిన పెంకులు తీయించి ఎర్రని కొత్తపెంకులు వేయించడం ఒక్కటే తరవాయి. తెల్లవారితే కొత్త కప్పు వెలుస్తుందనగా ఆ క్రితం రాత్రి బంగళాకి కొన్ని మాటలు వినిపించాయి

"మీ తమ్ముడికి నిద్దర పట్టిందా?"

"ఆఁ!"

"అయితే ఒకమారిలా రా..." ఆ తర్వాత మాటలు వినిపించలేదు ఒక్క క్షణం నిశ్శబ్దం.

"ఇవాల్టికి మన పెళ్ళి అయి సరిగ్గా ఏడాది అయింది తెల్సా?"

"ఊ..."

"ఏవిటి ఊ... ఇదిగో ఇలారా... నీ చెవిలో ఓమాట చెప్తాను. రమ్మంటుంటే... ఊ.."

ఇంతలో నిద్రలోంచిలేచిన మూడేళ్ళకుర్రాడిఏడుపు!

"అబ్బబ్బ వీడు నీకు తమ్ముడుకాదు, కొడుకుకంటే అన్యాయం అయిపోయాడు. ఒక్క క్షణం పక్కనుంచి కదల నియ్యడు కదా! ఇలా పెంచేవేవిటి శాంతా!"

ఆ చివరిమాట విని, రహదారి బంగళా ఉలిక్కి పడింది. "ఏ శాంత? సుబ్బరావయ్య కూతురు శాంతే! ఆ శాంత చావలేదన్నమాట! ధైర్యంగా జీవితాన్ని యెదు ర్కొంటోందా?" ఆ అమ్మాయి వదిలిన నిట్టూర్పు, ఆ సంతోషంలో రహదారి బంగళాకి వినిపించనే లేదు.

శరీరం అంతా ఉత్సాహంతోనూ చైతన్యంతోనూ ఊగిపోతోంది. కొత్త శకం ప్రారంభం అయినట్లనిపించింది.

ఆ చుట్టుపట్ల పరిసరాలంతా కొత్తగా కనిపించసాగాయి బంగళాకి.

కొత్త చిగురులు తొడిగిన చింతచెట్టుమీద కోకిల కూస్తోంది.

పొదలూ, తుప్పలూ కొత్త పువ్వుల్ని అలంకరించుకుంటున్నాయి.

మంచినీళ్ళ బావికి కొత్తగావేసిన గిలక కీచుమంటూ సంగీతం పాడుతోంది.

సూర్యుడప్పుడే ఉదయిస్తున్నాడు.

ఆ ఉదయం కాంతులుపడి, అప్పుడే లేస్తున్న నున్నని కొత్త బంగళా పెంకులు, ఉండుండి జిగేల్‌మంటూ మెరుస్తున్నాయి.

అవి, రహదారి బంగళా ఎర్రని నవ్వుల్లా ఆ ప్రదేశం అంతా కలకల్లాడుతూ వ్యాపిస్తూంటే, "బంగళా బాగుపడింది. కాలం మారింది" అనుకుంటూ సంతోషంగా కళ్లు ఎగరేశారు. కదలని రోడ్డుమీంచి నిత్యమూ ముందుకి కదిలి పోతూన్న మనుష్యులు—